సీఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి

మండల సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

పుల్లంపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డిలు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కొరముట్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో కుల, మత, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. అనంతరం ఎంపీపీ బాబుల్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో గ్రామాల అభివృద్ధికి తారురోడ్లకు గాను రూ. 16 కోట్లు పుల్లంపేట, పాపక్కగారిపల్లి, మల్లెంవారిపల్లి, వల్లూరుపల్లి, కేతరాజుపల్లి, కొత్తపల్లి, అగ్రహారం, దళవాయిపల్లి గ్రామాలను కలుపుకుంటూ తారు రోడ్లు మంజూరయ్యాయన్నారు. రోడ్ల నిర్మాణం పూర్తయితే రైతులు, ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. వైస్ ఎంపీపీ జయశంకర్, బోగా వెంకటసుబ్బమ్మ, రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మడగలం శ్రీను, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, తహసీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీఓ రఘురాం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రోడ్డు పనులకు భూమిపూజ

రైల్వేకోడూరు : పట్టణంలోని ఎంజీ రోడ్డు వద్ద ఎంపీ నిధులు రూ.5లక్షలతో సీసీరోడ్డు పనులకు సోమవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు భూమి పూజ చేసి ప్రారంభించారు. పట్టణాలల్లో, గ్రామాలలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం సీసీరోడ్లు మంజూరు చేసిందన్నారు. పనులు సకాలంలో నాణ్యతతో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ మేరకు రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపడుతోందని తెలియజేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, సుధాకర్‌రాజు, ఆర్‌సి.సురేష్‌బాబు, మాజీ జెట్పీటీసీ రాజేశ్వరి, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, చందు, వినోద్‌ఖన్నా తదితరులు పాల్గొన్నారు.


రైల్వేకోడూరులో భూమి పూజ కార్యక్రమంలో కొరముట్ల

ఆస్పత్రి నిర్మాణ పనుల పరిశీలన

- నెలరోజుల్లో ఆస్పత్రిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి
- కాంట్రాక్టర్, అధికారులకు ఆదేశించిన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : జిల్లా కేంద్రానికి తలమానికంగా నిలిచే వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణాలను నెలరోజులలో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. సోమవారం సాయంత్రం రాయచోటి ఏరియా ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న వందపడకల ఆసుపత్రి భవనం, డయాలసిస్ కేంద్రాం, మున్సిపల్ సభా భవన నిర్మాణాలను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాతో కలిసి పరిశీలించారు. తుదిదశలో ఉన్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే సూచించారు. మెరుగైన వైద్యం కోసం రాయచోటి ప్రాంత ప్రజలు కడప, తిరుపతి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే అలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో రూ. 27 కోట్లతో వందపడకల ఆసుపత్రిని నిర్మిస్తోందన్నారు. అంతకుముందుగా ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న రోగులను ఆయన పరామర్శించి అందుతున్న వైద్యం, చికిత్స సమయంలో వైద్యులు సహకారం, వసతులు, భోజనాలు తదితరాలపై ఆరాతీశారు. అనంతరం తొమ్మిది బెడ్స్‌తో ఉన్న డయాలసిస్ కేంద్రాన్ని పదహారు బెడ్స్‌కు పెంచేలా జరుగుతున్న పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ పనులను కూడా నెలరోజులలోపు పూర్తిచేసి ఇబ్బందులు ఎదుర్కొంటున్న డయాలసిస్ రోగులకు స్థానికంగానే వైద్య సేవలందేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న సభా భవనాన్ని ఆయన పరిశీలించారు. పనుల నిర్మాణాలలో నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలని ఆయన కాంట్రాక్టర్లకు సూచించారు. ఎమ్మెల్యే వెంట ఆసుపత్రి వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ్మద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్, సీనియర్ వైద్యులు మహేశ్వర్ రాజు, లక్ష్మీప్రసాద్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తదితరులు

క్లుప్తంగా

నేడు మూడు మండలాల్లో విద్యుత్ అంతరాయం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట 132 కె.వి ఎస్ఎస్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు(మంగళవారం) ఒంటిమిట్ట, నందలూరు, సిద్దవటం మండలాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని సోమవారం విద్యుత్‌శాఖ డీఈఈ మురళీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పైన తెలిపిన మూడు మండలాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

ఈ-క్రాప్ నమోదుపై శిక్షణ

పుల్లంపేట : ఈ-క్రాప్ పంట నమోదు కార్యక్రమంపై పుల్లంపేట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమానికి వీఆర్‌ఓలు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరసింహకుమార్ మాట్లాడుతూ గ్రామాలలో రైతులు సాగుచేసిన పంటను ఈ-క్రాప్‌లో నమోదయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. గ్రామాల్లోకి వెళ్లి వలంటీర్లు ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ-క్రాప్ నమోదు కాకుంటే నష్టపోయిన పంటకు పరిహారం అందదన్నారు. వ్యవసాయ అధికారి కృష్ణ చైతన్య, ఉద్యానశాఖ అధికారి భాస్కర్, ఆర్ఐ నవీన్, వీఆర్‌ఓలు, ఆర్‌బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 2 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

చిన్నమండెం : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆగస్టు 2వతేదీ నుంచి మండలంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని దిగువగొట్టివీడు, టి.చాకిబండ గ్రామ పంచాయతీలలో జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, సంబంధిత అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు గోశాల వార్షికోత్సవం



ఓబులవారిపల్లె : పెద్దఓరంపాడు గౌరిసిద్ధిలేశ్వరుని గుట్టపై గోశాల 6వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన యాగంతోపాటు విశేష పూజా కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. అలానే మధ్యాహ్నం ఆలయ ట్రస్ట్ అధ్వర్యంలో భక్తులకు అన్నదానం, పౌర్ణమి సందర్భంగా సాయంత్రం గిరి ప్రదిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని వారు కోరారు.

ఆగస్టు 2న టేక్ హోం రేషన్



జవహర్‌బాబు ఎంపీడీఓ

సిద్దవటం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆగస్టు 2వ తేదీన టేక్ హోం రేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ టేక్ హోం రేషన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు, రైస్, దాల్, ఎగ్స్, మిల్క్, వైఎస్ఆర్ కిట్ తదితర వస్తువులను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, కో-ఆప్షన్ సభ్యులు, స్థానిక ఎంపీటీసీ, స్థానిక సర్పంచ్‌లు హాజరుకావాలని ఆయన కోరారు.

40 టన్నుల యూరియా మంజూరు

సిద్దవటం : మండలానికి 40 టన్నుల నాగార్జున యూరియా మంజూరైందని వ్యవసాయాధికారి కె. రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ 45 కిలోల యూరియా బస్తా రూ.266.5 అవుతుందన్నారు. సిద్దవటం మండల పరిధిలో ఉన్న అన్ని రైతు భరోసా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. కావలసిన రైతులు తమ ఆధార్‌కార్డు తీసుకెళ్లి సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో యూరియాను పొందవచ్చునని ఆయన తెలియజేశారు.

విద్యా సామగ్రి పంపిణీ


విద్యార్థులకు కిట్లను అందిస్తున్న ఎంఈఓ

రాజంపేట రూరల్ : విద్యార్థులు దేశాభివృద్ధిలో ఒక భాగమని ఎంఈఓ-2 దాసరి సుబ్బరాయుడు కొనియాడారు. మండల పరిధిలోని శంకరాపురం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు రాజంపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పెనిగలపాటి చంద్రనాయుడు ఆర్థిక సహాయంతో క్లబ్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి కిట్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎంఈఓ-2 సుబ్బరాయుడు పాల్గొన్నారు. క్లబ్ సెక్రటరీ నరసింహ రాజు, టీ లక్ష్మీనారాయణ, షేక్ అబ్దుల్లా, ఆర్.వెంకటసుబ్బయ్యనాయుడు, హెచ్‌ఎం రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

రాయచోటి టౌన్ : విజయవాడలో న్యాయవాది విఠల్ బాబు హత్యకు నిరసనగా రాయచోటిలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. సోమవారం కోర్టు గేట్‌కు ఎదురుగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్ల (ఐఏఎల్) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అన్నమయ్య, కడప జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్, సహాయ కార్యదర్శి ఖాదర్ బాషా మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్ట ప్రకారం నడుచుకోవాలే కానీ కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరైంది కాదన్నారు. చట్టాల పట్ల, రాజ్యాంగం పట్ల అవగాహన లేని వారు ఇలాంటి హత్యలకు పాల్పడుతుంటారని పేర్కొన్నారు. ఇలాంటి నేరస్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. బీసీ న్యాయవాదుల సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు దేవపట్ల నాగముని, అన్నమయ్య జిల్లా న్యాయవాదుల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు రాజకుమార్ రాజు, ఆనందకుమార్, రాయచోటి మహిళ న్యాయవాదులు ప్రతినిధి ఖుష్ణమా, అజ్మతుల్లా, ధనుంజయ కుమార్, చిన్నయ్య, రవిశంకర్, టివి రమణ, హుమయూన్‌బాషా, ఆదిరెడ్డి నాయక్, నిరంజన్, సయ్యద్ ఖాదర్ వలి, సుబ్బరాయుడు, ఇలియాస్, వరలక్ష్మి, తేజ, మహబూబ్ జాన్, ఉత్తేజ్ పాల్గొన్నారు.


రాయచోటి టౌన్: నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాజంపేటలో..

రాజంపేట : రాజంపేట కోర్టులో న్యాయవాదులు సోమవారం తమ విధులను బహిష్కరించారు. విజయవాడకు చెందిన న్యాయవాది ఆదిశేషు విఠల్‌బాబును దారుణంగా హత్య చేసినందుకు నిరసనగా న్యాయవాదులు కోర్టుకు వెళ్లకుండా బార్ కార్యాలయానికి పరిమితమయ్యారు. హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి ఆనంద్‌తోపాటు అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

రాజంపేట రూరల్ : అరటి సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడిని పొందవచ్చని మండల ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు తెలియజేశారు. మండల పరిధిలోని హస్తవరం, ఆకేపాడు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు సోమవారం అరటిలో సమగ్ర పోషక, నీటి సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సిగటోకా ఆకుమచ్చ తెగులను ఆదిలోనే గుర్తించి తగిన మందులు వాడాలని సురేష్‌బాబు కోరారు. హస్తవరం సర్పంచ్ హస్తవరం మహేంద్రరెడ్డి, వీహెచ్‌ఏలు రామ్మోహన్‌రాజు, శివప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పల్లకీలో ఊరేగిన భద్రకాళి సమేతుడు


ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి వీరభద్రస్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. అలాగే ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢ వీధులలో ఊరేగించారు. పల్లకీ సేవ ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేద్దాం

రాయచోటి టౌన్ : మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అందరం కలసికట్టుగా కృషి చేద్దామని రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా కౌన్సిలర్లకు సూచించారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించుటకు 24 క్లాప్ ఆటోలను గతంలో కేటాయించడం జరిగిందన్నారు. ప్రతి నెల వీరికి చెల్లించవల్సిన ఓఅండ్ఎం ధర కంటే యూజర్ చార్జీలు కలెక్షన్లు తక్కువగా ఉండటం వలన నిర్వాహకుడికి ఆటోల నిర్వహణ చేయడం కష్టంగా మారిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సంస్థకు రీయింబర్స్‌మెంట్ కింద రూ.13,52,426లు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి కేటాయించేలా తీర్మానిస్తున్నట్టు తెలిపారు. అలాగే మనుషుల మృతదేహాలను దహనం చేయడానికి ఎలక్ట్రికల్ బర్నింగ్ మిషన్ రాయచోటి పట్టణానికి (మున్సిపాలిటీకి) కావాలని ప్రతిపాదన కోరుతున్నట్లు చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజూర్ రహిమాన్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా

శాస్త్రీయ సమాజ నిర్మాణమే జేవీవీ లక్ష్యం

రాయచోటి అర్బన్ : శాస్త్రీయ సమాజ నిర్మాణమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని ఆ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విజ్ఞాన్ స్కూల్ ఆవరణలో జన విజ్ఞాన వేదిక సభ్యత్వ పత్రాన్ని ఆయన సభ్యులతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హేతుబద్ధంగా ఆలోచించినప్పుడే శాస్త్రీయ దృక్పథం అలవడుతుందన్నారు. చంద్రుడిపై మానవుడు కాలుమోపి ఐదు దశాబ్దాలు దాటుతున్నా నేటికీ సమాజంలో మూఢనమ్మకాలు తొలగిపోలేదన్నారు. ప్రతి ఒక్కరూ జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరి శాస్త్రీయ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. డైట్ లెక్చరర్ వై.సి.రెడ్డెప్పరెడ్డి,జెవివి రాయచోటి మండల అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ జేవీవీ ఆధ్వర్యంలో ప్రతియేటా చెకుముకి పరీక్షలు నిర్వహించి విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనా దృక్పథంను పెంపొందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు కృతిమమేథ, 5జీ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్నాయన్నారు. ఈ తరుణంలో మనం కూడా శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందంటూ చెప్పారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు బయారెడ్డి, అశోకరెడ్డి, మల్రెడ్డి, రామయ్య, ప్రతాప్‌రెడ్డి, బాబాఫకృద్దీన్, రవీంద్రనాథరెడ్డి, రామచంద్రారెడ్డి, శివారెడ్డి, మధుసూదన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని విడుదల చేస్తున్న జేవీవీ సభ్యులు

చెత్త నుంచి సంపద సృష్టించవచ్చు

వీరబల్లె (రాయచోటిటౌన్): చెత్త నుంచి సంపదను సృష్టించవచ్చునని వీరబల్లె ఎంపీడీఓ మల్లీశ్వరి దిగువరాచపల్లె ప్రజలకు సూచించారు. సోమవారం ఆమె గ్రామంలో ఉన్న వర్మీ కంపోస్ట్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా వర్మీ కంపోస్ట్ యార్డుకు తరలించినట్లయితే అక్కడ ఎరువును తయారు చేయవచ్చునని తెలిపారు. ఈ విషయాన్ని తెలుసుకొని ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్స్ అందజేయాలన్నారు. ప్రతి ఇంటికీ రెండు బుట్టల చొప్పున పంపిణీ చేశారు. వీటి ద్వారా తడి, పొడి చెత్తను సేకరణకు ఉపయోగించాలని తెలిపారు. సర్పంచ్ గంగులమ్మ, ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు సోమవారం స్పందనలో డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశలవారీ ఆందోళనలో భాగంగా వారు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రామాంజులు, ఉపాధ్యక్షుడు రవికుమార్, విద్యుత్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.వి.రమణ, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిస్కమ్ అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నగేష్‌గౌడ్, శ్రీనివాసులురెడ్డి, రామాంజులురెడ్డి, ఏఐటీయూసీ నేత రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాత్మ విగ్రహానికి వినతిపత్రం..

రాజంపేట రూరల్ : సమస్యలు పరిష్కరించాలంటూ మహాత్మ గాంధీ విగ్రహానికి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. స్థానిక పాత పోలీసు లైన్ వీధిలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్దకు విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం కాంట్రాక్టు కార్మికులు తరలివచ్చి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల క్రమబద్దీకరణ, పీఆర్‌సీ అమలు, ఈపీఎఫ్ టు జీపీఎఫ్‌ను ప్రవేశపెట్టాలని కోరారు. గ్రేటు జేఎల్ఎంలను రెగ్యులర్ చేయాలని తెలియజేశారు.


గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న విద్యుత్ కార్మికులు

పేదల భూములకు పట్టా ఇవ్వండి

ఓబులవారిపల్లె : భూమిలేని ఎస్టీ, ఎస్సీ, బీసీ పేదలకు భూములను ఇవ్వాలని మాజీ ఎంపీపీ తమ్మెద తిరుపాల్ తహసీల్దార్ పుల్లరెడ్డిని కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో లింగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎస్టీలు తమ భూములను గుర్తించి అప్పగించాలని తహసీల్దార్ పుల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపాల్ మాట్లాడుతూ గతంలో లింగిరెడ్డిపల్లెలో ఇరవై మంది ఎస్టీ కుటుంబాలకు ప్రభుత్వం భూములిచ్చిందని అవి అటవీశాఖ అధీనంలో ఉండటంతో వారికి ప్రత్యామ్నాయంగా భూములు చూపించి పట్టాలు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా చిన్నంపల్లె దళితవాడకు చెందిన దాదాపు 38 కుటుంబాలకు రెండు పంచాయతీలలో ఎస్సీ, ఎస్టీ బీసీలకు చెందిన 40 కుటుంబాలకు భూపంపిణీలో భాగంగా పట్టాలు ఇవ్వాలని ఆయన విన్నవించారు. ఇందుకు తహసీల్దార్ పుల్లారెడ్డి మాట్లాడుతూ సంబంధిత భూములను సర్వే నిర్వహించి నివేదికలను పంపించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జెడ్పీటీసీ పి.లక్ష్మి నరసయ్య, డీటీ రామ్మోహన్, ఆర్ఐ రామ్మోహన్‌నాయుడు సర్వేయర్ భవాని తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ తిరుపాల్, జెడ్పీటీసీ లక్ష్మినరసయ్య

పౌరులు హక్కులను తెలుసుకోవాలి

చిన్నమండెం : పౌరులు తమ హక్కులను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తహసీల్దార్ శ్రీరాములునాయక్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని చిన్నమండెం దళితవాడలో పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎస్ఐ రమేష్‌బాబు, ఎంపీడీఓలు పౌరహక్కుల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలి

పెనగలూరు : స్పందనలో వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యతను ఇవ్వాలని మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం లేదా ఇతర రోజులలో వచ్చిన అర్జీలపై ప్రతిశాఖ అధికారి స్పందించాలన్నారు. ముఖ్యంగా రైతులను మండల కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మండల పరిధిలో ప్రజలు సమస్యలు పరిష్కరించినప్పుడే ఇటు అధికారులకు, పాలకులకు మంచి పేరు వస్తుందని ఆయన తెలిపారు. అలాగే పలు సమస్యలపై తహసీల్దార్ శ్రీధర్ రావు చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుబ్బరాయుడు, ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, వీఆర్‌ఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డి

డ్వాక్రా సంఘాల ద్వారా ఆర్థిక అభివృద్ధి

లక్కిరెడ్డిపల్లె : మహిళలు డ్వాక్రా సంఘాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు కాలయాపన చేయకుండా స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేరి ఆర్థికాభివృద్ధిలో ముందుకు సాగాలన్నారు. స్వయం సహాయక సంఘాలు ద్వారా బ్యాంకు నుంచి రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించి మళ్లీ కొత్త రుణాలు పొందాలని ఆయన తెలిపారు. అనంతరం మండల సమాఖ్య అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎంపిక చేశారు. ఏపీఎం నిరంజన్, సీసీలు, మహిళలు, గ్రామ సమైక్య సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి

అర్జీదారులకు అన్నదానం

రాయచోటి టౌన్ : ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు నిర్వహించే అన్నదాన కార్యక్రమంతో ఈ సోమవారంతో 30వ వారానికి చేరుకుంది. జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సూచనల మేరకు దాతలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ మదనపల్లె పరిశీలకుడు హబీబ్‌ఖాన్ ఆర్థిక సహకారంతో అర్జీదారులకు రుచికరమైన ఆహారాన్ని అందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ తబ్రేజ్‌ఖాన్, కౌన్సిలర్లు గౌస్‌ఖాన్, అల్తాఫ్, యూసూఫ్, మునాయజ్ ఆలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.


దేశభక్తిని పెంపొందించిన ప్రేమ్‌చంద్ రచనలు

రాజంపేట టౌన్ : స్వాతంత్ర ఉద్యమంలో ప్రముఖ హిందీ నవలాకారుడు దివంగత ప్రేమ్‌చంద్ రచనలు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఎంతగానో దోహదపడ్డాయని ఎంఈఓలు కొండూరు రఘునాథరాజు, సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో సోమవారం ప్రేమ్‌చంద్ హిందీభవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రేమ్‌చంద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ-1, ఎంఈఓ-2ల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రేమ్‌చంద్ సమాజంలో వివిధ వర్గాల సమస్యలను తన కథావస్తువులుగా ఎంచుకొని మూడు వందలకు పైగా కథలు రచించారన్నారు. ప్రేమ్‌చంద్ రచించిన 'గోదాన్' అనే నవలను ప్రపంచంలో అన్ని భాషల్లోకి అనువదించినట్లు వారు గుర్తు చేశారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతిని సుప్రియ, ద్వితీయ బహుమతిని జాహ్నవి, తృతీయ బహుమతిని చాందిని కైవసం చేసుకున్నారు. హిందీ ఉపాధ్యాయులు చాంద్‌బాషా, వెంకటలక్ష్మి, నిర్మల, ప్రసన్న, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓలు

జూనియర్ కళాశాలల్లో సదుపాయాలు కల్పించండి

రాయచోటి అర్బన్ : జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఆయన మాట్లాడుతూ పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా నీరుగారుస్తున్నారన్నారు. కేంద్రప్రభుత్వం విద్యారంగంలో అనేక సంస్కరణలను తీసుకువస్తూ విద్యావ్యవస్థను నాశనం చేస్తోందంటూ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వడంతోపాటు బస్‌పాస్‌లను ఇప్పించాలని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామంటూ హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, ఎస్ఎఫ్ఐ నేతలు అల్తాఫ్, ఇస్మాయిల్, చిన్నారెడ్డి, కిరణ్, హరి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

బదిలీ ఉపాధ్యాయులకు వీడ్కోలు

నందలూరు(రాజంపేట) : బదిలీలైనా ఉపాధ్యాయులకు నాగిరెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సోమవారం తోటి ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బదిలీ అయిన గంగాధరరెడ్డిస్వామి, మొఘల్ ఖాజాహుస్సేన్, ధరణికుమార్, రాజశేఖర్, చాన్‌బాషా, జోసఫ్, జూనియర్ అసిస్టెంట్ నాగార్జున, రికార్డు అసిస్టెంట్ వరప్రసాద్‌లను సిబ్బంది శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

మామిడి మొక్కలు త్వరగా నాటాలి

రామాపురం : మామిడి మొక్కలు నాటే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఏపీడీ రెడ్డప్పనాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఉపాధి సిబ్బంది, హౌసింగ్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 2023 సంవత్సరానికి సంబంధించి మండల వ్యాప్తంగా 66 మంది రైతులకు సంబంధించి 262 ఎకరాలల్లో మామిడి మొక్కలు నాటుతున్నారన్నారు. ప్రస్తుతం ఇంకా 70 ఎకరాల్లో మొక్కలు నాటాల్సి ఉందని, మామిడి మొక్కలు నాటుకున్న రైతులకు మూడు సంవత్సరాలపాటు ప్రభుత్వం ఉచితంగా ఎరువులు, కలుపు నివారణ, అంతర్ పంటలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. అలాగే చెట్లను కాపాడుకునేందుకు రైతులకు చెట్టుకు రూ.5.15 చొప్పున మూడు సంవత్సరాలపాటు రైతుల ఖాతాలో జమ చేస్తామన్నారు. రైతులు త్వరగా బ్యాంకు ఖాతా వివరాలను ఉపాధి కార్యాలయానికి అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సురేంద్రనాథరెడ్డి, ఈసీ శ్రీకాంత్‌రెడ్డి, టీఏలు, ఎఫ్ఏలు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ రెడ్డప్పనాయుడు